ఓట్లపై అవగాహన రేపు

జూబ్లీహిల్స్, జనవరి 23 : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జనవరి 25న (రేపు) పాఠశాలల విద్యార్థులకు ఓటరుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జూబ్లీహిల్స్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా తెలిపారు. యూసుఫ్‌గూడలోని సర్కి ల్ కార్యాలయంలో 'నేషనల్ ఓటర్స్ డే..' నిర్వహణపై జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై చర్చించారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సుకుమార్ దామిలే

హిమాయత్‌నగర్: దేశంలోని వివిధ రంగాల్లో లోడింగ్,అన్‌లోడింగ్ విభాగంలో పనిచేసే హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా లోడింగ్, అన్‌లోడింగ్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుకుమార్ దామిలే, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్ రాజ్,రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాం డ్ చేశారు.

గురువారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అసంఘటిత రంగం లో పనిచేసే కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను సవరించి కార్పొరేట్ శక్తులకు మేలు చేసేలా చట్టాలను కేంద్రం తీసుకువచ్చిందని విమర్శించారు.

ఈ సమావేశంలో యూనియన్ జాతీయ నేతలు ప్రవీణ్‌కుమార్, వెంకటసుబ్బయ్య, అంజిబాబు, రమణ, మహేష్,రంజిత్,అమర్‌సింగ్, భాటి యా, గట్టయ్య ,రాజయ్య పాల్గొన్నారు.

మూడు నెలల క్రితం పుట్‌పాత్ ఆక్రమణ తొలగింపు.. తాజాగా అదేస్థలంలో వెలిసిన ఓ దుకాణం

బస్ టెర్మినల్‌లో .. ఆటో స్టాండ్‌లు

- బస్సుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- తొలగించిన పుట్‌పాత్ ఆక్రమణల స్థానంలో రాత్రికి రాత్రి వెలుస్తున్న దుకాణాలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

బోరబండ బస్ టెర్మినల్‌కు ఆర్టీసీ బస్సులు నిత్యం 800-850 సంఖ్యల్లో తిరుగుతుంటాయి. ఈ టెర్మినల్ చౌరస్తాలో పెరిగిన వాహనాల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ సజావుగా కదిలేందుకు వీలుగా ఇక్కడున్న పుట్‌పాత్ ఆక్రమణలను గత అక్టోబర్‌లో బల్దియా అధికారులు తొలగించారు.అంతవరకు బాగానే ఉంది. కాని.. బోరబండ బస్ టెర్మినల్‌లో తాజా పరిస్థితి గతంలో కంటే ఘోరంగా తయారైంది. తొలగించిన పుట్‌పాత్ ఆక్రమణల స్థానంలో షేరింగ్ ఆటో స్టాండ్‌లు వెలిశాయి. బస్ టెర్మినల్‌కు ఆనుకుని ఉన్న సాయిబాబా ఆలయం ప్రహరీకి ఆనుకొని రెండు ఆటో స్టాండ్‌లు దర్శనమిస్తున్నాయి. మొత్తానికి బస్ టెర్మినల్ మొత్తం ఏరియా ఆటోలతో నిండిపోయింది. దీంతో ఆర్టీసీ బస్సుల రాకపోకలకు గతంలో కంటే ఎక్కువ ఇబ్బందులు వస్తున్నాయని ఆర్టీసీ సిబ్బంది వాపోతున్నారు.

మూడున్నర నెలల క్రితం బస్ టెర్మినల్ చౌరస్తాలోని పుట్‌పాత్ ఆక్రమణలను బల్దియా తొలగించినా.. అదేస్థానంలో ఒక్కొక్కటిగా తిరిగి ఆక్రమణలు దర్శనమిస్తున్నాయి. టెర్మినల్‌కు ఆనుకుని ఉన్న వినాయకరావునగర్ కమ్యూనిటీహాల్ సమీపంలో రాత్రికి రాత్రి ఓ దుకాణం వెలిసింది. బస్ టెర్మినల్ ఏరియాలో షేరింగ్ ఆటో స్టాండ్‌లను తొలగించాలని.. పుట్‌పాత్ ఆక్రమణదార్లపై బల్దియా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – ఎర్రగడ్డ, జనవరి 23:

నిమ్స్ ఉద్యోగికి పురస్కారం

ఆరోగ్య రంగంలో అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా నిమ్స్ లైజనింగ్ అధికారి అంతారం రాంబాబు ఉత్తమ పురస్కారానికి ఎంపికయ్యారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొగుగారం చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. – ఖైరతాబాద్, జనవరి 23 :



నివాళి: హైదర్‌గూడలోని సుభాష్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ తదితరులు– మైలార్‌దేవ్‌పల్లి

కార్మికుల పక్షాన ఉంటాం

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 23: కార్మికుల పక్షాన ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేలా పోరాడుతున్నట్లు సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్ అన్నారు. పరిశ్రమలో గాయపడిన కార్మికుడిని పర్మినెంట్ చేయాలని యాజమాన్యాన్ని కోరడంతో వారు అంగీకరించి లిఖితపూర్వకంగా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రుద్రకుమార్, సాయిబాబాలు మాట్లాడుతూ.. కాటేదాన్ పారిశ్రామికవాడలోని తిరుమల మెటల్ బాక్స్ పరిశ్రమలో పి.జగన్ కార్మికుడిగా పని చేస్తున్నాడన్నారు. ఈ నెల 21న విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మిషిన్‌లో పడి కుడి చేతి బోటన వేలు విరిగింది. గతంలో కూడా ఎడమ చేతి వేళ్లకు గాయాలయ్యాయన్నారు. ఇదే విషయాన్ని సీఐటీయూ దృష్టికి తేవడంతో గురువారం పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికుడి ఆసుపత్రి ఖర్చులతో పాటు పర్మినెంట్ ఉద్యోగిగా తీసుకోవాలని కోరడంతో యాజమాన్యం కూడా అంగీకరించారన్నారు. కార్మికులకు అండగా ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేందుకు పాటుపడుతున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, కార్మికుడి భార్య శ్వేత, నవీన్ పాల్గొన్నారు.

గాయపడిన కార్మికుడిని పర్మినెంట్ చేస్తూ పత్రాన్ని అందజేస్తున్న యాజమాన్యం

దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పరికరాలు

జూబ్లీహిల్స్,జనవరి 23 : దివ్యాంగులకు అవసరమైన పరికరాలు ఉచితంగా ఇవ్వడం అభినందనీయమని జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా పేర్కొన్నారు. గురువారం యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో అలిమ్‌కో స్వచ్ఛంద సంస్థ నుంచి వినికిడి , దృష్టిలోపం, సుమగ్యకేన్, ట్రైయిలీ కేన్, ఆర్థోపెడిక్ వైకల్యం ఉన్న వారికి కృత్రిమ పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా అలిమ్‌కో ప్రతినిధి ప్రసన్నతో కలిసి 112 పరికరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ యూసీడీ సీఈఓలు ఎం.ప్రశాంత్, పి.వెంకటయ్య, ఎం.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌లో.. శిక్షణ తరగతులు ప్రారంభం

శిక్షణ తరగతులకు హాజరైన మహిళలు

ఎర్రగడ్డ, జనవరి 23: లైట్‌హౌస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బోరబండ డివిజన్ బంజారానగర్ కొమురం భీమ్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతులను బల్దియా డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా గురువారం ప్రారంభించారు. నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు. వివిధ అంశాల్లో ఇక్కడ అందించే శిక్షణ వల్ల ఉపాధిని అందిపుచ్చుకొని కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో లైట్‌హౌస్ క్లస్టర్ హెడ్ ఆర్తి, స్పందన, శ్రీనివాస్, సిద్ధు, బోరబండ ఎస్సై ఎండీ సర్దార్ జమాల్, స్థానిక నాయకులు హబీబాసుల్తానా, ఆనంద్, అశోక్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రామసభలు

శంషాబాద్ మున్సిపాలిటీలో 20వ వార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, తదితరులు

శంషాబాద్ రూరల్, జనవరి 23 : పేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేయడం కోసం ఏర్పాటు చేస్తున్న గ్రామసభలు శంషాబాద్ మండలంలో కొనసాగుతున్నాయి. మండలంలోని కవ్వగూడ,పిల్లోనిగూడ, శంకరాపూర్, మదన్‌పల్లి కొత్తతండా గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామ సభల్లో పాల్గొన్న ఎంపీడీవో మున్ని, ఇతర అధికారులు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. శంషాబాద్ మున్సిపాలిటీలోని కొత్వాల్‌గూడ, ఎయిర్‌పోర్టు కాలనీతో పాటు పాత శంషాబాద్ 20 వార్డుల్లో సభలు నిర్వహించారు. సభలలో ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, వైస్ చైర్మన్ బండిగోపాల్, కమిషనర్ సుమన్‌రావు, కౌన్సిలర్లు రేఖగుప్త, అమృతారెడ్డి, లక్ష్మీ గౌడ్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మెస్సీ ఐఎస్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: ఓయూ పరిధిలోని ఎమ్మెస్సీ ఐఎస్ కోర్సు బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ కోర్సు అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును వచ్చే నెల 10వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలి

నేతాజీనగర్ ప్రభుత్వ పాఠశాలలో నేతాజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 23: అలుపెరుగని పోరాటంతో ఓటమి ఎరుగని వ్యక్తిత్వంతో, మాతృభూమి సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహానేత నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమార స్వామి అన్నారు. నేతాజీ జయంతిని పురస్కరించుకొని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని బుద్వేల్ నేతాజీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి విద్యార్థులకు బిస్కెట్లు, అరటి పండ్లు పంపిణీ చేశారు. నేడు విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, కొంపల్లి జగదీష్, శ్రీనివాస్, కిషోర్‌రెడ్డి, బాలకృష్ణ, ఉపాధ్యాయులు మమత, మహేశ్వర్, లక్ష్మి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ సుభాష్‌చంద్రబోస్ యువతకు ఆదర్శం

హిమాయత్‌నగర్‌లో సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

హిమాయత్‌నగర్: భారత స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ యువతకు ఆదర్శప్రాయుడని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, నగర కార్యదర్శి ఎన్. శ్రీకాంత్ అన్నారు. సుభాష్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా గురువారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్యప్రసాద్, నేతలు పి.శివకుమార్,మాజీద్ అలీ ఖాన్,అనిల్‌కుమార్,శేఖర్, వీరేష్, భాను,సంజయ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే దానం నాగేందర్

హిమాయత్‌నగర్,జనవరి 23: పేదలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు.ఖైరతాబాద్,సోమాజిగూడ డివిజన్లకు చెందిన 85 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్,85 మందికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను గురువారం ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత యాదవ్,కాంగ్రెస్ నేతలు శ్రీనివాస్,షరీఫ్,కృష్ణయాదవ్,మహేందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

పెట్టుబడులకు అనువైన రాష్ట్రం అస్సోం

ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ రనోజ్

ఖైరతాబాద్, జనవరి 23 : అస్సోం రాష్ట్రాన్ని పెట్టుబడులకు గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని ఆ రాష్ట్ర పాఠశాల, ఉన్నత విద్య, గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ రనోజ్ తెలిపారు. అడ్వాంటేజ్ అస్సోం, ఫిక్కీ ఆధ్వర్యంలో గురువారం హోటల్ తాజ్‌కృష్ణలో ఏర్పాటు చేసిన సభను అస్సోం కార్మిక సంక్షేమ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి బి. కల్యాణ్ చక్రవరి, అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) కేఎస్ గోపీనాథ్ నారాయణన్, వాణిజ్యశాఖ కమిషనర్ ఓనం ఎస్ సింగ్, ఫిక్కీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ వీవీ రామరాజుతో కలిసి ప్రారంభించారు. డాక్టర్ రనోజ్ మాట్లాడుతూ అస్సోంలో ఉన్న అవకాశాలపై జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయన్నారు. కమ్యూనికేషన్, మౌలిక సదుపాయాల కల్పన, పరిశ్రమల అభివృద్ధిలో విశేషంగా ప్రగతి సాధించామన్నారు. పాఠశాల విద్యాభివృద్ధికి విశేష కృషి జరుగుతోందని, పాఠశాలల కోసం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆధారిత మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టనున్నామన్నారు. పెట్టుబడులకు సింగిల్ విండో క్లియరెన్స్ సిస్టమ్‌తో సిద్ధంగా ఉన్నామని, ఈ మేరకు గౌహతిలో ఫిబ్రవరి 25, 26 తేదీల్లో అడ్వాంటేజ్ అస్సోం 2.0 పేరుతో సదస్సును నిర్వహిస్తున్నామన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ రనోజ్

చైన్ స్నాచింగ్

బంజారాహిల్స్,జనవరి 23: ఆర్డర్ డెలివరీ చేసేందుకు వచ్చిన ఓ డెలివరీ బాయ్ వద్దనుంచి సెల్‌ఫోన్ లాక్కెళ్లిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..షేక్‌పేటలోని అల్ హమ్రా కాలనీలో నివాసం ఉంటున్న ఏ.మోహన్‌రావు జెప్టో సంస్థలో రైడర్‌గా పనిచేస్తుంటాడు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 92లోని ఎమ్మెల్యే కాలనీలో ఓ కస్టమర్‌కు 10 లీటర్ల మినరల్ వాటర్ బాటిల్ అందించేందుకు మోహన్‌రావు వచ్చాడు. కస్టమర్‌కు ఫోన్ చేసి ఆర్డర్ డెలివరీ కోసం చూస్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్ మీద వచ్చారు. బైక్ వెనకాల కూర్చున్న వ్యక్తి మోహన్‌రావు వద్దకు వచ్చి మాట్లాడే ప్రయత్నం చేస్తూ అతటి చేతిలోంచి వివో ఫోన్ లాక్కుని బైక్ మీద పారిపోయారు. ఈ మేరకు బాధితుడు మోహన్‌రావు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పీజీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: ఓయూ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈనెల 28లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో వచ్చే నెల 3 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు.

వివిధ దూరవిద్య పీజీ కోర్సుల ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: ఓయూ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే వివిధ పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

వివిధ లా కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ కోర్సుల రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 2వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

29 నుంచి కలబురిగిలో భారతీయ సంస్కృతి ఉత్సవ్

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గోవిందాచార్య తదితరులు

ఖైరతాబాద్ : శ్రీ కొత్తల బసవేశ్వర భారతీయ శిక్షణ సమితి, భారత్ వికాస్ సం ఘం, వికాస్ అకాడమీ సంయుక్తాధ్వర్యం లో ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 6వరకు కర్నాటక రాష్ట్రంలోని కలబురిగిలో భారతీయ సంస్కృ తి ఉత్సవ్‌ను నిర్వహిస్తున్నట్లు భారత్ వికాస్ సంఘం వ్యవస్థాపకులు గోవిందాచార్య తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ది కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివాల్యూషన్ అధ్యక్షులు కె. లక్ష్మా రెడ్డి, ప్రతినిధి లీలా లక్ష్మా రెడ్డి, బస్వరాజ్ పాటిల్, వేణుగోపాల్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి ఉత్సవ్‌లో భాగంగా మాతృ, విద్య, యువ, గ్రామకృషి, ఆహార ఆరోగ్య, స్వయం ఉద్యో గ, పర్యావరణ, సేవాశక్తి, దేశ, ధర్మ, సంస్కృతి సమ్మేళనా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

పరిశోధన గ్రంథానికి ఉత్తమ పురస్కారం

నరసింహా క్షేత్ర సాహిత్యం అనే పరిశోధన గ్రంథానికి గాను రచయిత, గోషామహల్ ప్రభుత్వ పాఠశాల స్కూట్ అసిస్టెంట్ (తెలుగు) డాక్టర్ వొజ్జల శరత్ బాబుకు ఉత్తమ పురస్కారానికి ఎంపికయ్యారు. రాజ్‌భవన్ హైస్కూల్‌లో తెలుగుపండిట్‌గా పనిచేసిన శరత్ బాబు ఉపాధ్యాయ వృత్తితో పాటు రచయితగా గుర్తింపు తెచ్చుకున్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు గిరిడు రామ్మూర్తి పంతులు వర్ధంతి సభలో హైకోర్టు న్యాయమూర్తి రాధారాణి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. – ఖైరతాబాద్, జనవరి 23